నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. చంపాపేట 33/11 విద్యుత్‌ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు.. సాయిరాంనగర్‌, శిఖరాఎన్‌క్లేవ్‌, ఆర్‌టీసీ, భానునగర్‌, కేశవనగర్‌, సింగరేణి, రాఘవేంద్ర కాలనీలు. సుల్తానాఅల్వా ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు కటకోని కుంట, చంపాపేట పాతబస్తీ, సాయిరాం, సుల్తానాఅల్వా, బస్తీ దవాఖానా ప్రాంతం, రాజిరెడ్డినగర్‌ కాలనీలు.

ఆస్మాన్‌గఢ్‌ పరిధిలో..

సైదాబాద్‌: ఆస్మాన్‌గఢ్‌ ట్రాన్స్‌కో డివిజన్‌ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష్మీనగర్‌ క్రాస్‌ రోడ్‌, రామాలయం, వాణి నగర్‌, పటేలమ్మ మడిగ, ఆనంద్‌ బిస్కెట్‌ ఫ్యాక్టరీ, దోబీఘాట్‌ రోడ్‌ పరిసర ప్రాంతాలు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు ఇంద్రప్రస్థ కాలనీ, లక్ష్మీనగర్‌, టెలిఫోన్‌ ఎక్స్ఛేంజ్‌, పద్మావతి కాలేజ్‌, సంగం లక్ష్మీబాయ్‌ కాలేజ్‌ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని డీఈ విష్ణువర్ధన్‌ రెడ్డి తెలిపారు.

ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్‌పై ఫిర్యాదులు



ప్రజావాణిలో పాల్గొన్న సర్కిల్‌ డీసీ తిప్పర్తి యాదయ్య

ఎల్‌బీనగర్‌: ఎల్‌బీనగర్‌ జోనల్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్‌పై-1, యూబీడీ-2, ఇంజినీరింగ్‌-1 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా కాప్రా సర్కిల్‌లో టౌన్‌ప్లానింగ్‌పై-1, ఉప్పల్‌ సర్కిల్‌ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్‌విభాగంపై -2, హయత్‌నగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్‌ విభాగంపై -4, ఎల్‌బీనగర్‌ సర్కిల్‌, సరూర్‌నగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో ఏలాంటి ఫిర్యాదులు రాలేదు.

క్రిస్టియన్‌ కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభం

వనస్థలిపురం: కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో అధిక నిధులు తీసుకువచ్చి కాలనీలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వనస్థలిపురం డివిజన్‌ కార్పొరేటర్‌ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌ పరిధి క్రిస్టియన్‌ కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ విష్ణుశ్వరి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రమేష్‌, నాయకులు కవిత, భాను, కాలనీవాసులు హరిందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌ గౌడ్‌, లక్ష్మారెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, చంద్రారెడ్డి, గోవిందరెడ్డి, వెంకట్‌రెడ్డి, అసిఫ్‌, మురళి, సుధాకర్‌, రామేశ్వరమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ తీగల రంజిత్‌రెడ్డి మృతి



తీగల రంజిత్‌రెడ్డి

మలక్‌పేట: మీర్‌పేట మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్‌ నాయకుడు తీగల రంజిత్‌రెడ్డి(52) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. మూసారంబాగ్‌ డివిజన్‌కు చెందిన రంజిత్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వారం రోజుల క్రితం బేగంపేటలోని కిమ్స్‌ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రంజిత్‌రెడ్డి మృతితో మూసారంబాగ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



ఇంటింటికి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

చాదర్‌ఘాట్‌: బడీడు పిల్లలను బడిలో చేర్పడమే లక్ష్యంగా కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మలక్‌పేటలో ఉపాధ్యాయులు ఇంటింటి వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న సౌకర్యాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన టీచర్లు మెరుగైన సౌకర్యాలు ఉంటాయని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు యూనిఫాంతో పాటు మధ్యాహ్న భోజనం ఉంటుందని తల్లిదండ్రులకు వివరించారు.

వర్షాకాలం.. విద్యుత్‌ తీగలతో భద్రం



- అప్రమత్తతతో ప్రమాదాల నివారణ
- తీగలు తెగితే అధికారులకు సమాచారం ఇవ్వండి
- సాక్షితో డీఈ రాజేందర్‌



రాజేందర్‌

చంపాపేట: ఇప్పుడిప్పుడే వర్షాలు మొదలవుతున్నాయి. చినుకులు కురిస్తేనే కొన్ని కాలనీలు పీకల లోతు మునిగిపోతాయి. అలాంటి సమయంలో విద్యుత్‌ తీగలతో అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. విద్యుత్‌ సమస్యలు తలెత్తితే సొంతంగా మరమ్మతులు చేయరాదని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని చంపాపేట విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ డీఈ రాజేందర్‌ స్పష్టం చేశారు. వర్షాకాలంలో విద్యుత్‌ ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సాక్షితో వివరించారు.

- విద్యుత్‌ తీగలు తెగిపడినా, చేతులకు అందే ఎత్తులో వేలాడుతున్నా వాటిని తాకటం, మరమ్మతు చేసే ప్రయత్నం చేయవద్దు. వెంటనే విద్యుత్‌ శాఖ అధికారులకు కానీ టోల్‌ ఫ్రీ నెంబరు 1912కు సమాచారం అందించాలి.
- ఇళ్లలో విద్యుత్‌ తీగలపై బట్టలు ఆరవేయవద్దు. సర్వీస్‌ వైర్‌ ఇన్సులేషన్‌ సరిగా ఉందో లేదో పరీక్షించాలి. సరిగ్గా లేకపోతే సర్వీస్‌ వైర్‌తో ఉన్న సపోర్ట్‌ జీఏ వైర్‌కు విద్యుత్‌ సరఫరా అయ్యి ఇంటికి మొత్తం షాక్‌ వచ్చే ప్రమాదం ఉంటుంది.
- ఇన్సులేషన్‌ లేని సర్వీస్‌ వైర్‌తో ఇంటి ముందు రేకులకు కూడా విద్యుత్‌ సరఫరా జరిగే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో రేకులను తాకే ప్రయత్నం చేయవద్దు.
- ప్రతి ఇంటి విద్యుత్‌ వైరింగ్‌కు ఎర్తింగ్‌ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో సెల్‌ఫోన్‌, ల్యాప్‌టాప్‌ల చార్జింగ్‌, ఇతర విద్యుత్‌ గృహోపకరణాలు ఉపయోగించే సమయంలో వాటిని తడిచేతులతో తాకరాదు.
- వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్‌ షాక్‌కు గురైతే రక్షించాలనే ఆత్రుతతో అతడిని ముట్టుకోరాదు. షాక్‌కు గురైన వ్యక్తి నుంచి కరెంట్‌ తీగను వేరు చేయటానికి విద్యుత్‌ ప్రవహించని పొడి కర్రను లేదా ప్లాస్టిక్‌ పైప్‌ను మాత్రమే ఉపయోగించాలి.
- బహుళ అంతస్తుల సమీపంలో ఉన్న హైటెన్షన్‌, 11కేవీ వైర్లు ఉన్నట్‌లైతే వాటి దరిదాపుల్లోకి వెళ్లవద్దు.
- వర్షం పడే సమయంలో తరచూ సర్వీస్‌ వైర్లకు కార్బన్‌ పట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఇంటికి విద్యుత్‌ సరఫరా నిలిచిపోతుంది. తడి కట్టెతో సరిచేసే ప్రయత్నం చేయవద్దు. విద్యుత్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.
- ప్రతి ఇంట్లో డీపీ మెయిన్‌ స్థానంలో ఎంసీబీలను ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ జరిగితే కరెంట్‌ సరఫరా వెంటనే నిలిచిపోతుంది.
- ఉరుములు మెరుపుల సమయంలో ఇంట్లోని విద్యుత్‌ గృహోపకరణాల విద్యుత్‌ సరఫరాను నిలిపివేయాలి.

విద్యుత్‌ సబ్‌ స్టేషన్ల నంబర్లు		చంపాపేట		వనస్థలిపురం	
బడంగ్‌పేట	8712472425	చంపాపేట డీఈ కె. రాజేందర్‌		ఏడీఈ ఎం. రాంచదర్‌	8712472408
చంపాపేట	8712472415	ఫోన్‌ నెం	8712472406	ఏఈ కె. వెంకటరావు	8712472419
మీర్‌పేట	8712472423	ఏడీఈ కె. వెంకటనర్సింహ్మారెడ్డి		మీర్‌పేట ఏఈ బాలగౌడ్‌	8712472416
లెనిన్‌నగర్‌	8712472422	ఫోన్‌ నెం	8712472407	బైరామల్‌గూడ ఏఈ వి. పర్వతాలు	8712472418
వనస్థలీపురం	8712472420	ఏడీఈ ఐసీఎస్‌సీ కె. సునీత	8712472409	లెనిన్‌నగర్‌ ఏఈ రవికుమార్‌	8712472421
బైరామల్‌గూడ	8712472427	ఏఈ శ్రీనివాస్‌ ఫోన్‌ నెం	8712472414	బిఎన్‌రెడ్డి ఏఈ శివకుమార్‌	8712472411
బీఎన్‌రెడ్డి	8712472413	ఏఈ ప్రవళికారెడ్డి	8712472429	బడంగ్‌పేట ఏఈ వి. శ్రీనివాస్‌	8712472426

స్టేటస్‌ కో సమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్‌

వనస్థలిపురం: హయత్‌నగర్‌ డివిజన్‌ పరిధి కమలానగర్‌, ఆంధ్రకేసరి నగర్‌ కాలనీలలో రిజిస్ట్రేషన్లపై విధించిన స్టేటస్‌ కో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ అన్నారు. సోమవారం కమలానగర్‌ కాలనీ కమ్యూనిటీహాల్లో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. 40 ఏళ్ల క్రితం తాము స్థలాలు కొని ఇళ్లు కట్టుకున్నామని, ఇప్పుడు కొందరు ఇనాం భూములంటూ కోర్టుకు వెళ్లి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. కొంతమంది నాయకులు తెరవెనుక ఉండి ఇలాంటి రిజిస్ట్రేషన్లు నిలిపివేత చర్యలు చేపడుతూ వసూళ్లకు తెరలేపారని అలాంటి వారి చర్యలు సాగవని, అధికారులు ఎవరైనా స్టేటస్‌ కో అంటూ చట్టవిరుద్ధంగా వ్యవహరించాలని చూస్తే వారి స్టేటస్‌ తొలగించేలా చేస్తామని మధుయాష్కీ హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్‌ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌ సామ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చెన్నగోని రవిందర్‌, కమలానగర్‌ కాలనీ అధ్యక్షుడు టీ.వీ. రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, దివాకర్‌, వెంకటేశ్వర్లు, పాశం అశోక్‌గౌడ్‌, సత్యనారాయణ, పట్లోళ్ల మాధవరెడ్డి, రవికిరణ్‌ పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల ఏర్పాట్లపై దృష్టి

దిల్‌సుఖ్‌నగర్‌: డివిజన్‌లో అంతర్గత రోడ్ల ఏర్పాటుకై ప్రత్యేక దృష్టి సారించినట్లు రామకృష్ణాపురం డివిజన్‌ కార్పొరేటర్‌ రాధాధీరజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. పెడింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అధ్వానంగా మారిన రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు.

రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం



పనులు ప్రారంభించిన కార్పొరేటర్‌ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్‌: ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలోని అంతర్గత కాలనీలు, బస్తీల్లోని రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్‌ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఐఎస్‌సదన్‌లోని కోదండరాంనగర్‌ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కోదండరాంనగర్‌ కాలనీ ఏర్పడిన నాటి నుంచి ఈ కాలనీలో రహదారుల నిర్మాణం జరగలేదన్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శిరీష, బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు జంగారెడ్డి, సురేష్‌, రంగారావు, వెంకటేష్‌, పాండు, హనుమంతరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ ఆవిష్కరణ

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌ కోదండరాంనగర్‌ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయలో గురువారం నుంచి ఆరు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు మర్రికంటి లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి నారాయణ మూర్తి తెలిపారు. సోమవారం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. చివరి రోజు సోమవారం మహాపూర్ణాహుతి 108 కళశాలతో అభిషేకం, చక్రతీర్థ, అలంకరణ నివేదన ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పార్కులు సుందరీకరించాలి

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని 24వ డివిజన్‌లో గల పార్కు స్థలాలను సుందరీకరణ చేయాలని కోరుతూ సోమవారం స్థానిక మాజీ కార్పొరేటర్‌ ఏనుగు రాంరెడ్డి ఆధ్వర్యంలో విశాఖనగర్‌ ఫేస్‌-2 కాలనీవాసులు కమిషనర్‌ పి.సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖనగర్‌ కాలనీలో సర్వేనంబర్‌ 128లో 1800 గజాల పార్కు స్థలం ఉందన్నారు. పార్కు స్థలంలో చల్లని నీడనిచ్చే చెట్లు, పచ్చిక బయళ్లు, ఉండేలా పచ్చని గడ్డి, చిన్నారులు ఆడుకునేలా ఆటవస్తువులు ఏర్పాటు చేయాలన్నారు. పార్కులు లేక చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారని గుర్తుచేశారు. ఇంట్లోనే ఉంటున్న పెద్దలు, మహిళలకు కొద్దిసేపు అలా సేదతీరేందుకు పార్కులను అభివృద్ధి చేయాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో విశాఖనగర్‌ ఫేస్‌-2 కాలనీ అధ్యక్షుడు రాజేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చిత్రం, నాగారం వెంకటేశ్‌, వెంకటేశ్‌గౌడ్‌ పాల్గొన్నారు.

ట్రంక్‌లైన్‌ పనుల్లో వేగం పెంచాలి

ఎల్‌బీనగర్‌: గత రెండేళ్లుగా సాగుతున్న ట్రంక్‌లైన్‌ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. సోమవారం హయత్‌నగర్‌లోని జలమండలి, సివరేజీ బోర్డు మేనేజర్‌ శ్రీనివాస్‌ రెడ్డిని ప్రజావాణి కార్యాక్రమంలో కలిసి పనులు త్వరగా చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. పనుల జాప్యంతో సమీప కాలనీలవాసులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచాలన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.23, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్‌ రూ.28, క్యాబేజీ రూ.15, క్యారెట్‌ రూ.40, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.33, మునగ రూ.65, కందగడ్డ రూ.45, బీట్‌రూట్‌ రూ.23, కీర రూ.35, బీన్స్‌ రూ.85, క్యాప్సికమ్‌ రూ.61. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

రోడ్డు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నాగోలు: నాగోలు డివిజన్‌ పరిధి లక్ష్మీనర్సింహా కాలనీలో 40 ఫీట్ల రోడ్డును కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని నాగోలుకు చెందిన బుషిరెడ్డి రంగారెడ్డి సోమవారం హయత్‌నగర్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ తిప్పర్తి యాదయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాగోలు నుంచి గతంలో నక్షబాట, అక్కడ 40 ఫీట్ల రోడ్డు ఉండేదని కొంతమంది స్థానికంగా కొత్త లేఅవుట్‌ తయారు చేసి అక్రమంగా రోడ్డును ఆక్రమించుకొని ప్లాట్లుగా విక్రయించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చెరువులో వ్యర్థాలు వేయొద్దు

లింగోజిగూడ: మినీ ట్యాంక్‌బండ్‌గా పేరుపొందిన సరూర్‌నగర్‌ చెరువు కలుషితం కాకుండా శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని లింగోజిగూడ కార్పొరేటర్‌ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శానిటేషన్‌ స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా సోమవారం ఆయన సరూర్‌నగర్‌, ఎల్‌బీనగర్‌ జోన్ల ఎంటమాలజీ సిబ్బందితో కలిసి చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని, చెరువులో మాంసం దుకాణాల వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలు వేయరాదన్నారు. తపోవన్‌ కాలనీ, గ్రీన్‌పార్కు కాలనీ, సిగరేణి కాలనీలకు చెందిన పలువురు ఇక్కడ చెత్త వేయరాదని, గ్రీన్‌పార్కు కాలనీ నుంచి చెరువు వైపునకు వెళ్లే దారిలో చెత్తను వేయకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఎస్‌ఈ మాధవరెడ్డి, ఏఈలు రాంబాబు, మణి, సిబ్బంది అర్జున్‌పాషా, యాదయ్య, శంకరప్ప, రుక్కయ్య పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడి రిమాండ్‌

చాదర్‌ఘాట్‌: హత్యచేసి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని చాదర్‌ఘాట్‌ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 7న రాత్రి మలక్‌పేట జడ్జెస్‌ కాలనీలో ఓ అమ్మాయి విషయమై చెలరేగిన ఘర్షణలో చంచల్‌గూడకు చెందిన మహ్మద్‌ ఇర్షాద్‌ అలీ (25) జడ్జెస్‌ కాలనీలో నివసించే నిజాముల్‌ హక్‌ (22)ను కత్తితో పొడిచి హత్య చేసాడు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న అతడిని చాదర్‌ఘాట్‌ పోలీసులు ఆదివారం సాయంత్రం డబీర్‌పురా రైల్వేస్టేషన్‌ వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

డ్రగ్స్‌ విక్రయిస్తున్న వ్యక్తి..

నాగోలు: డ్రగ్స్‌ విక్రయించేందుకు యత్నించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌, ఆనంద్‌నగర్‌ కాలనీ చెందిన మొహమ్మద్‌ ఖాసిముద్దీన్‌(27) నగరంలో రియల్‌ ఎస్టేట్‌ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియం ప్రభుత్వ పెట్రోల్‌ పంప్‌లో వద్ద ఎండీఎంఏ డ్రగ్స్‌ విక్రయించేందుకు యత్నిస్తుండగా సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్‌ పోలీసులు అదుపులోకి తీసుకుని 17 గ్రాముల ఎండీఎంను డ్రగ్స్‌ స్వాధీనం చేసుకున్నారు. ఖాసిముద్దీన్‌ బెంగళూరుకు చెందిన సౌరవ్‌ సంతోష్‌ నుంచి డ్రగ్‌ను కొనుగోలు చేసి నగరంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఖాసిముద్దీన్‌ను రిమాండ్‌కు తరలించగా సౌరవ్‌ సంతోష్‌ పరారీలో ఉన్నాడు.

న్యాయవాదిని కిడ్నాప్‌చేసిన వ్యక్తి అరెస్ట్‌

హస్తినాపురం: తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడం లేదని న్యాయవాదిని కిడ్నాప్‌ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. చింతలకుంటలో ఉంటున్న హైకోర్టు న్యాయవాది పాలడగు నారాయణ (52) ఈ నెల 7న ఆఫీస్‌కు వెళ్లి ఇంటికి రాలేదు. వెంకటేశ్‌ అనే వ్యక్తి, నారాయణ భార్య సువర్ణమ్మకు ఫోన్‌చేసి నీ భర్తను నేనే కిడ్నాప్‌ చేశానని నాకు డబ్బులు కావాలని ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం వెంకటేశ్‌ అదుపులోకి తీసుకుని విచారించగా న్యాయవాది నారాయణ తనకు రూ. 35 లక్షల ఇవ్వాలని, ఎన్ని సార్లు అడిగినా ఇవ్వకపోవడంతో తానే కిడ్నాప్‌కు పాల్పడినట్లు వెంకటేశ్‌ ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి మంత్రికి వినతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన అసోసియేషన్‌ నేతలు

ఎల్‌బీనగర్‌: జియోలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా (జీఎస్‌ఐ)లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సౌతరన్‌ రీజియన్‌ చైర్మన్‌ ఆదర్ల మహేష్‌ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జీఎస్‌ఐ డైరెక్టర్‌ జనరల్‌ అసిత్‌సాహాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ మహేష్‌ మాట్లాడుతూ.. ఉద్యోగుల క్యాడర్‌ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని, అదేవిధంగా బండ్లగూడ జీఎస్‌ఐలోని ఆడిటోరియాన్ని ఆధునీకరణ చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాజశేఖర్‌, శ్రీనివాసులు, మేఘరాజ్‌, సునిల్‌కుమార్‌, ప్రభాకర్‌, శివశంకర్‌, ఆనంద్‌కుమార్‌ ఉన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌

నాగోలు: కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ అధికారులకు సూచించారు. సోమవారం కొత్తపేట డివిజన్‌ కమర్షియల్‌ టాక్స్‌ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశ్వర్లు కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. రోడ్లు ప్రారంభించేటప్పుడు సరైన లెవెల్స్‌ చూసుకోవాలని, అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములవ్వాలన్నారు. కాలనీల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్‌ వెంట రవీందర్‌, విశ్వేశ్వరయ్య, రామకృష్ణ, రాజు, సురేందర్‌ చారి, నాయికోటి అనిల్‌ కుమార్‌ ఉన్నారు.

పాఠశాలకు భవనాన్ని కేటాయించాలి



ప్రజావాణిలో వినతి పత్రంఇస్తున్న కార్పొరేటర్‌ అరుణ

సైదాబాద్‌: సైదాబాద్‌ గాంధీనగర్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు భవనాన్ని కేటాయించాలని సైదాబాద్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కొత్త కాపు అరుణ రవీందర్‌రెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె జిల్లా అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. గాంధీనగర్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పాఠశాలకు సమీపంలో ఖాళీగా ఉన్న మలక్‌పేట బీ-బ్లాక్‌ క్వార్టర్స్‌లోని నెంబర్‌ 56, 57 క్వార్టర్లను పాఠశాల భవనానికి కేటాయించాలని కోరారు.